# 26. పురుషుడు

జననపట్టీల్లో అతని పేరు జీన్ మేరీ మాత్యూవాలెట్ అని వ్రాయబడి వుంది; కాని అతను 'మేడమ్' అనే పేరునే పిలువబడేవాడు. జిల్లాలో అతనొక మూర్ఖుడు; కాని ఇతర మూర్ఖుల్లాగు లోకుల ధర్మంమీద బతికేరకం కాదు. తల్లి వదిలిన కొద్ది ఆస్తిమీదే సుఖంగా బతికేవాడు; ఇది - ఇతర్లకు అతని మీది దయకన్న, ఈర్ష్యను ప్రబలింపజేసింది. ఇతరమూర్ఖుల్లాగు దెయ్యంకళ్ళూ, జంతులక్షణాలూ అతనిలో లేవు; సగానికి తెరువబడ్డ అతని పెదవులతోనూ, చిరునవ్వును సూచించే అతని కళ్ళతోనూ - అన్నింటికన్నా ముఖ్యమైంది - విసుగులేకుండా ఆడపిల్లలాగు అలంకరించు కోవటంతోనూ - చూసేందుకు అందంగానే కనిపించేవాడు. ఆడదానిలాగే దుస్తులు వేసుకోవటంతో - తనను 'మాడమ్' అని పిలిచేందుకు ఏవిధమైన అభ్యంతరమూ లేదని సూచించేవాడు.

నీరసంగా, సున్నితంగా, నాజూకైన ముఖకళలోవున్న తను - తన యీడు ఆడపిల్లలకన్న పొడుగులేకపోయినా - చిన్నతనంలో అమ్మ ముద్దుగా పిలిచే 'మేడమ్' అనే పేరుకు తనెందుకు అయిష్టతను చూపాలీ?

అతనితల్లి తన ప్రేమను సూచించేందుకు ఎంతో ఆనందంతో 'మేడమ్' అని అతని చెవుల్లో గొణిగేది.

అతని అమ్మమ్మ మాత్రం తమాషాగా అంటూండేది: "అసలు విషయం ఏమిటంటే - వీడిలోని పురుషత్వం ఏమంత చెప్పుకోదగ్గదికాదు-"

అతని తాత మరింత తమాషాగా అనేవాడు: "వీడు పెరిగి పెద్దవాడైనా వీడిలోని యీ సుగుణంమాత్రం మాయమవదని నాకు గట్టినమ్మకం-"

ఆ కుటుంబమంతా అతను నిజంగా ఆడపిల్లయినట్టే మెలిగేవారు. అతని తల్లీ అమ్మమ్మా, తాతా చనిపోయ్యాక - 'మేడమ్' అతని బాబాయ్ రక్షలో హాయిగా బతకగలిగాడు. ఆ పినతండ్రి బ్రహ్మచారిగా జీవిస్తూన్న యీ మూర్ఖుణ్ని ఒక కంట కనిపెట్టివుండేవాడు. అతన్ని చూసిన కొద్దీ ఆ పినతండ్రి ఆపేక్ష పెరిగి, అతన్ని 'జీన్ మేరీ మాత్యూ వాలెట్ మేడమ్' అని పిలిచేవాడు.

ఆ ఊళ్ళోని మిగతా వాళ్ళందరూ కూడా అతన్ని అలాగే పిలిచేవారు. ఇతర్లకు ఏ హానీ తలపెట్టని అతన్ని బాధిద్దామని కాదు; అలా పిలవటం అతనికి ఆనందాన్నిస్తుందని.

ఆ వీధిలోని కుర్రాళ్ళు అతనికి ఏ హానినీ తల పెట్టకుండానే - ఫ్రాక్‌తోనూ టోపీతోనూ దర్శనంయిచ్చే యీ 'ఆడమూర్ఖుణ్ని' అలవాటు చొప్పున అలా పిలిచేవాళ్ళు. కాని ఒకవేళ అతను పురుషుడి దుస్తులు ధరించినట్టయితే అది తమకెంతో ఆనందమైనట్టు అతన్ని ఏడిపించాలనిపించేది.

కాని 'మేడమ్' యీ విషయంలో చాలా జాగర్త తీసుకున్నాడు; ఎందుకంటే ఆ పేరు అతనికి ఎంత ముఖ్యమో, ఆ దుస్తులు కూడా అంత ముఖ్యమైనవే! అందుకనే దేన్నీ లెక్క చెయ్యకుండానే - ఆడపిల్లలాగు దుస్తులు వేసుకోవటం అతనికి ఎంతో సరదా. తను మగవాడేననీ, కాని మారువేషంతో ఆడపిల్లలాగు బతుకుతున్నాననీ, అతనికి బాగా తెలుసు; ఈ విషయంలో తను అప్పుడప్పుడు ప్రయత్నించే మగనడకతో తనకు యీ వేషం నైతికం కాదని రుజూచేస్తూండేవాడు. అతను ధరించే పొడుగాటి టోపీని రంగు రంగుల రిబ్బన్లతో అలంకరించేవాడు. చిన్న చిన్న అడుగులు వేస్తూ, మాటి మాటికీ నాలికతో పెదవుల్ని తడుపుతూ వృథాగా చేతులు తిప్పటంతో, ఒళ్ళు విరుచుకోవటంతో చూసేవాళ్ళకు నవ్వు తెప్పించేవాడు.

ఇలాటి సమయాల్లో ఏ కొత్తమనిషన్నా అతని స్నేహాన్ని కోరినట్టయితే "ఓ! మేడమ్! మీరు ఎంత అందమైన ఆడపిల్లగా తయారయ్యారు!" అని, అనటం అత్యవసరం.

దీనికి అతను ఎంతో సంతోషించి చిరునవ్వుతో జవాబు చెప్తాడు: "నిజమే...కాని నేను ఇదంతా తమాషాకు చేస్తున్నానని అందరికీ తెలుసు.."

కాని ఆ చుట్టుపక్కల నాట్యాలు జరుగుతే అతను ఆడపిల్లగానే ఆహ్వానింపబడేవాడు. యువతుల్ని తనతో నాట్యం చెయ్యమని అతను ఎన్నడూ కోరేవాడు కాదు. ఈ విషయం ఒకనాడు ఒకాయన ప్రశ్నిస్తే, అది ఎంతో మూర్ఖపుప్రశ్న ఐనట్టు పెద్దగా నవ్వి అతను జవాబు చెప్పాడు: "నేను పురుషుడిలాగు దుస్తులు వేసుకోక పోవటంవల్ల... ఆడపిల్లల్ని నాతో నాట్యం చెయ్యమని అడగను...చూడండి...నా దుస్తులు... కనపడటంలా?"

అతన్ని ప్రశ్నించిన మనిషి మళ్ళీ అన్నాడు: "పోనీ పురుషుడిలాగు దుస్తులు వేసుకోరాదూ?"

అతను ఒక్క క్షణం దొంగచూపుతో ఆలోచించి, "నేను మగవాడిలాగు దుస్తులు వేసుకుంటే, మరి ఆడపిల్లలాగుండనుగా!" అన్నాడు కులుకుతూ భుజాలు ఎగరేస్తూ.

కాని యీ సంభాషణ, అతని ఆలోచనను రేపింది. కొంతకాలమయ్యాక తనను ఆ ప్రశ్న వేసినమనిషి కనిపిస్తే, "నేను పురుషుడిలాగు దుస్తులు వేసుకుంటే...మరి నన్ను 'మేడమ్' అని పిలుస్తారా" అని అడిగాడు.

"ఓ...తప్పకుండా...నిన్ను ఎప్పుడూ అలాగే పిలుస్తాము."

ఇప్పుడు తన దుస్తులకన్న తన పేరుకే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటంవల్ల అతని కిది ఆనందించదగ్గ విషయమే అయింది. మరునాడు పినతండ్రి లాగు, తాతటోపీ, తండ్రికోటూ వేసుకొని అతను బజారుకెళ్లాడు. ఆడదాని దుస్తుల్లో అతన్నిచూసి దయతో నవ్వేందుకు అలవాటుపడ్డ ప్రజలందరికీ ఇది విప్లవంగాతోచి...ఆశ్చర్యంతోనూ, భయంతోనూ అతన్ని చూసి విపరీతంగా నవ్వారు.

దీనికి కొందరు బుద్ధిమంతులు ఆయాచితంగా చూపిన దయా, మరికొందరు చూపిన నిరసనా, మొత్తం మీద అందరూ చూపిన ఆశ్చర్యాన్ని చూసి...తను చూడనట్టుగానే నటించి దీనికి బాధపడకూడదనుకున్నాడు; వీధిలో ఆడుకునే కుర్రాళ్ళు అతని చుట్టూ చేరి "మేడమ్! నువ్వు లాగూ తొడిగావే?... మేడమ్ నువ్వు కోటువేశావే....భలే!...మేడమ్!" అని గంతులు వేస్తూ అతన్ని ఏడిపించసాగారు. ఇది భరించలేక వెంటనే ఆ ప్రదేశాన్ని వదిలెయ్యాలని అతను ప్రయత్నించాడు కాని, తమకందరికీ సంబంధించిన వస్తువును దేన్నో అతను దొంగిలించినట్టు – కుర్రాళ్ళు అతని వెంటపడి కేకలు వేయసాగారు.

ఇన్నాళ్ళు స్త్రీలాగు కనపడాలనే అతని ప్రయత్నమూ, స్త్రీలాగు కులుకుతూ నడిచే అతని అలవాటూ, కావాలని కొని తెచ్చుకున్న స్త్రీ ఇతర వేషభాషలూ – ఇవన్నీ పురుషత్వానికి సంబంధించిన అనేక అలవాట్లను మాయం చేసినయ్. పెద్ద ఉంగరాల జుట్టు అతని తాత పెద్దటోపీ కింద సరిపోక, రిబ్బన్ల సహాయం కావాల్సి రావటం మరీ ఇబ్బందిగా తోచింది. అడుగడుక్కూ ఎగిరిపడే అతని భుజాలూ, ఊపిరి పీల్చేప్పుడు కావాలని ఎగరేసే అతని రొమ్మూ, యీ పురుషవేషంలో మెలికలు తిరుగుతూ మెల్లిగా కదిలే అతని శరీరమూ...మొత్తంమీద పురుషవేషంలో వున్న ఆడదాని లాగు కన్పించటం...ఇంతకన్న నవ్వు తెప్పించే ప్రాణి లేనట్టుగానే అందరికీ తోచింది.

అందుకనే పెద్దలూ, పిన్నలూ, యువతులూ, ఒకరేమిటి...ఊరంతా తలొక మాటలతోనూ వేటాడేప్పటికి...ఆ మూర్ఖుడు భయపడి ఇంటికి పరుగెత్తాడు. గదిలో

ఏకాంతంగా రెండు చేతుల మధ్యా తల ఇరికించి అసలు విషయాన్ని గూర్చి ఆలోచించసాగాడు.

వీళ్ళందరికీ తన మీద కోపం దేనికీ? నిజంగానే అందరికీ తనమీద కోపం వున్నట్టు స్పష్టంగా తెలుస్తూనేవుంది. తనేం తప్పు జేశాడు? పురుషుడిలాగు దుస్తులు ధరించినంత మాత్రాన తను ఎవరికి హాని చేసినట్టు? ఇంతా ఏడుస్తే తను పురుషుడు కాకపోతేగా?

తను ఇన్నాళ్లూ ఆనందించే 'మేడమ్' అనే తన ముద్దు పేరును గూర్చి జీవితంలో మొట్టమొదటిసారి అతను విపరీతంగా భయపడసాగాడు. అది ముద్దుపేరుగా కాకుండా, ఒక్క పెద్ద తిట్టుగా అతనికి ఇప్పుడు తోచింది. కాని వెంటనే అతనికి ఇంకో అనుమానం వచ్చింది. ఒకవేళ ...తను...ఆడపిల్లేనా?

ఈ సందేహాన్ని గూర్చి బాబాయ్‌ని అడగాలనుకున్నాడు. కాని ఇతర్లమీద తను దయదల్చి తన రహస్యాన్ని బైట పెట్టుకోవటం అతనికి ఇష్టంలేదు.

ఎందుకోగాని తను పురుషుడేననే గట్టినమ్మకం అతనికి కుదిరింది. ఇది ఎలాగైనా తేల్చుకోవాల్సిన ముఖ్య విషయంగా అతనికి తోచింది. ఇంతవరకూ సమయం రాకపోవటం వల్ల మరుగునపడి వున్న అతని మూర్ఖపు మోసం ఇప్పుడు పని చేయసాగింది.

మర్నాడు అతను మామూలుగా ఆడపిల్లలాగే దుస్తులు వేసుకొని, నిన్నటి రసాభాసంతా పూర్తిగా మరచిపోయినట్టు బజారువెళ్ళాడు; కాని ప్రజలు మాత్రం నిన్నటిగోలను ఇంకా మరిచిపోలేదు. కొందరు అతనివెనుక నవ్వారు; మరికొందరు ఎదుటపడి నవ్వారు. కొంటెకుర్రాళ్ళు మాత్రం అతని వెంటపడి, "మేడమ్! నీలాగూ ఏదీ?...కోటు తొడుక్కోలేదేం?"...అని గోల చేశారు.

అతను మాత్రం యీ మాటల్ని విననట్టే నటించాడు. వారసలు దేన్ని గూర్చి యీ మాటల్ని అంటున్నారో ఆలోచించటం తనపని కాదన్నట్టే ఊరుకున్నాడు. పూర్వంలాగే హాయిగా ఆనందంతో బతుకుతూన్నట్టే కళ్ళు ఎగరేస్తూ నడవసాగాడు. తనను 'మేడమ్' అని పిలిచేవాళ్ళ మీదికి ఉరికి చీల్చాలనివున్నా, ఆ పిలుపు వినపడగానే పూర్వం లాగే సంతోషంతో నాలుకతో పెదవుల్ని తడుపుకుంటూ ... ఒళ్ళు తిప్పుకోసాగాడు.

ఈవిధంగా రోజులూ, నెలలూ గడిచిపోయినయ్; క్రమంగా అందరూ అతన్ని గోల చేసిన విషయమే మరిచిపొయ్యారు. కాని తను పురుషుడేనని వీళ్ళందరికీ రుజూచేసి, విజయసూచకంగా వీళ్ళందరిముందూ పెద్దగా నవ్వాలనే అతని ఆలోచనను ఇంకా వదలలేదు. నిజంగానే అతను అమాయకుడు; అతనికి ఇరవై ఏళ్ళు వచ్చినయ్. కార్యసిద్ధికోసం యీ పట్టుపట్టాక - అతను దేన్నిగూర్చి కాని ప్రశ్నలు వేయకుండానే...

ప్రజల మాటలూ, చేతలూ జాగర్తగా చూసి, మెల్లిగా ఒక్కొక విషయాన్నే గ్రహించ సాగాడు.

పల్లెటూరి నాట్యాలదగ్గర యువకులు తాము అనుభవించిన యువతుల్ని గూర్చి పొగడటాన్నీ, యువతులు కొంతమంది యువకుల్ని మాత్రమే గూర్చి పొగడటాన్నీ అనేకసార్లు అతను విన్నాడు. నాట్యం పూర్తయ్యాక కొంతమంది యువతీ యువకులు – జంటలు ఒకరి నడుంచుట్టూ ఇంకోరు చేతులు వేసి ఎక్కడికో వెళ్ళిపోవటాన్ని అనేకసార్లు చూశాడు.

ఇతన్ని గూర్చి ఎవరికీ అనుమానాలులేవు. అతను మాత్రం జాగర్తగా మాటలు విని అన్ని విషయాల్ని జాగర్తగా పరిశీలించి, అసలు ఏం జరుగుతుందో చివరకు గ్రహించాడు.

ఒకరాత్రి నాట్యం పూర్తయ్యాక, అందరూ వెళ్ళబొయ్యే సమయాన – దగ్గరి తోటలోంచి ఒక ఆడగొంతు సహాయంకోసం వేసేకేకలు వినిపించినయ్; ఆ కంఠం అందగత్తె జోసఫైన్‌దని తెలుసుకోగానే వారందరూ ఆమె సహాయార్థం పరుగెత్తారు. వారు వెళ్ళేప్పటికి ఆమె 'మేడమ్' చేతుల్లో నలిగి సగం చచ్చినట్టుగా వుంది.

ఈ మూర్ఖుడు ఆమెకోసం వేచికూర్చొని, ఇతర యువకులు యువతుల్ని ఆనంద పెట్టినట్టే తనూ ప్రయత్నిద్దామని, ఆమె పైకి ఉరికాడు; కాని ఆమె అతన్ని అభ్యంతరపెట్టేప్పటికి – అతను తన బలాన్నంతటినీ ఉపయోగించి ఆమె నోరునొక్కి తన వాంఛను పూర్తిగా తీర్చుకుందామని ప్రయత్నించాడు; కాని...

జోసఫైన్ రక్షించే సందర్భంలో వారు అతన్ని కిందికి తోశారు; కాని అతను సముద్రపుటలలాగు ఎగిరి నిలబడి, ఉద్రేకంతో కూడిన కోపంతో అరిచాడు! "నేను స్త్రీనికాదు; నేను యువకుణ్ణి...నేను మళ్ళీ చెప్తున్నాను! నేను పురుషుణ్ణి!"